# కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం చీకటే

- ప్రజలందరూ టార్చ్‌లైట్లు కొనుక్కోవాల్సిందే
- కేసీఆర్ హయాంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ
- బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావును ఆశీర్వదించండి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- రుద్రంగి మండల కేంద్రంలో ప్రచారం



బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా ఓటు అభ్యర్థిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ప్రజాప్రతినిధులు

రుద్రంగి, అక్టోబర్ 30: 'కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం చీకటిమయమే అవుతుంది.. ప్రజలందరూ టార్చ్ లైట్లు కొనుక్కోవాల్సి వస్తుంది. ఈ తొమ్మిదిన్నర ఏండ్లల్లో ఎన్నో పనులు చేసినం. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తాం' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన రుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన ఇంటింటికీ గులాబీ జెండా కార్యక్రమానికి హాజరు కాగా, మండల ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు, మహిళలు మంగళహారతులు, బతుకమ్మలు, బోనాలు, డప్పుచప్పుళ్లతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ కొన్నేండ్లపాటు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించి చేసిందేమీలేదదన్నారు. ఇప్పుడు స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ అమలు చేస్తున్న పథకాలు చూసి కండ్లు మండించుకుంటుందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం మళ్లీ అంధకారం అవుతుందన్నారు. రాష్ట్రం ఏర్పాటుకాక ముందు రైతు ఆత్మహత్యలు ఉండేవని గుర్తుచేశారు. కాంగ్రెస్ హయంలో హైదరాబాద్‌లో మతఘర్షణలు ఉండేవని, ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొన్నదన్నారు. పదేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసి రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. కళాకారుల సంఘం సభ్యులు, రజక సంఘం సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు మద్దతు తెలిపారు.

### ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

ప్రజలందరూ నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తా. ప్రచారంలో ఎక్కడికి వెళ్లిన ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది. మీ ఆదరణ, అభిమానం చూస్తే తప్పకుండా విజయం సాధిస్తామనే నమ్మకం కులుగుతున్నది. ఈ తొమ్మిదేండ్లలోనే రుద్రంగి మండలంలో రూ.109కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టినం. రాబోయే రోజుల్లో దవాఖాన, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, డ్రైనేజీ వంటి మిగతా అన్ని సమస్యలు పరిష్కరిస్తాం. ప్రతిపక్షాలను నమ్మి మోసపోవద్దు. అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకువస్తున్న తనకు ఒక అవకాశం ఇవ్వండి. ఏడాదిలోపు సమస్యలన్నీ పరిష్కరిస్తా.

– చల్మెడ లక్ష్మీనరసింహారావు,
వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి



# వాళ్లవన్నీ కట్టుకథలే

ధర్మపురి: గాదెపల్లిలో మంత్రి ఈశ్వర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

ధర్మపురి/ధర్మపురి రూరల్, అక్టోబర్ 30: 'కాంగ్రెస్, బీజేపీలు చెప్పేవన్నీ కట్టుకథలే. వాళ్లు నోటికి ఏది వస్తే అది చెప్పడమే తప్ప చేసేదేం ఉండదు. వాళ్ల పాలన మనకు కొత్తనా..? రాష్ట్రాన్ని ఏండ్లకేండ్లు పాలించిన్రు. నేనొక్కటే చెబుతున్నా. కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణ మళ్లీ అంధకారం అవుతుంది. కరెంట్ కష్టాలు వస్తాయి. మళ్లీ మనకు ఆ చీకటి బాధలు అవసరమా..? మీరే ఆలోచించి నిర్ణయం తీసుకోండి' అంటూ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి ధర్మపురి మండలం గాదెపల్లి, తీగలధర్మారం గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించగా, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికి తిలకం దిద్దారు. ఈ సందర్భంగా మంత్రి, ప్రతి వీధిలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. పేదల సంక్షేమం కోసం పనిచేసే బీఆర్ఎస్ ప్రభుత్వానికే మళ్లీ పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. 'నేనొక్కటే ప్రశ్నిస్తున్నా.. 5 గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావాలా..? 24గంటల నాణ్యమైన కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ కావాలా..? ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ కర్ణాటక మోడల్‌ను నమ్ముకుంటే కటిక చీకట్లోకి వెళతామన్నారు. గతంలో రైతుల దగ్గర పన్నులు వసూలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌దైతే.. ఇప్పుడు రైతులకే రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ ఇస్తున్న ఘనత బీఆర్ఎస్‌దేనని కొనియాడారు. యాసంగిలో రైతులకు రైతుబంధు ఇవ్వవద్దని కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఫిర్యాదు చేయడం ధారుణమన్న సంగతిని గుర్తించాలని సూచించారు. సబ్బండవర్గాల సంక్షేమాన్ని దృష్టిలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో రూపొందించిందనీ, అది బీఆర్ఎస్ విజయానికి నాంది అని చెప్పారు. ఇక్కడ డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటీసీ బత్తిని అరుణ, ఎంపీపీ చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్, ఆర్బీఎస్ మండల కన్వీనర్ సౌళ్ల భీమయ్య, పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ అక్కనపల్లి సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# మీ ఆదరణ మరువలేను

- మీ సేవ కోసమే అహర్నిశలూ కృషిచేస్తున్న
- మున్నూరు కాపులకు అన్నిరంగాల్లో ప్రాధాన్యం ఇచ్చాం
- జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్
- జిల్లా కేంద్రంలో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్నూరు కాపు ప్రజాప్రతినిధులు, నాయకులు

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 30: ' నా రాజకీయ జీవితంలో మున్నూరు కాపులు అందించిన అండదండలు, ఆదరణ మరువలేను. మీ సేవ కోసమే అహర్నిశలూ కృషిచేస్తున్న. నా వెన్నంటి నిలిచిన మీకు బీఆర్ఎస్ హయాంలో అన్ని రంగాల్లో ప్రాధాన్యమిచ్చాం' అని జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలే తన వారసులని, ఎల్లవేళలా నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడే తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. 2014, 2018లో తన వెంటే ఉన్నారని, 2023లో కూడా వెన్నంటి ఉండి భారీ మెజార్టీతో గెలిపించాలని మున్నూరు కాపులకు విజ్ఞప్తి చేశారు. జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సమ్మేళనానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2014లో రాజకీయాల్లోకి వచ్చినప్పుడు మున్నూరుకాపులు తన వెంటే నడిచారని, అప్పుడు ఎమ్మెల్యేగా ఓడినప్పటికీ చాలా బూత్‌లలో అత్యధిక మెజార్టీ ఇచ్చారని గుర్తు చేశారు. మున్నూరు కాపులు ఎక్కువగా ఉండే బూత్‌లలో మెజార్టీ రావడంతో కాంగ్రెస్ నాయకులే అవాక్కయ్యారని చెప్పారు. 218 బూత్ నంబరులో 95 శాతం ఓట్లు తనకు పోలవ్వడంతో కాంగ్రెస్ నాయకుడు జీవన్‌రెడ్డే పరేషాన్ అయ్యాడని తెలిపారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేయగా, నియోజకవర్గం మొత్తంలో కాపులు తన వెన్నంటి ఉండి ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. దావ వసంతను జడ్పీటీసీగా గెలిపించి జడ్పీ చైర్‌పర్సన్‌ను చేశామని, ఇలా ఎంతో మంది కాపు బిడ్డలకు బీఆర్ఎస్ హయాంలో తగిన న్యాయం చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకంలో కాపులే ఎక్కువ శాతం లబ్ధిపొందుతున్నారన్నారు. 2014, 2018లో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చామని స్పష్టం చేశారు. వంద పడకల మాతాశిశు దవాఖాన, మెడికల్ కళాశాలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. మెడికల్ కళాశాల స్థలం గురించి ఎంతో మంది రాజకీయం చేసి మోకాలడ్డే ప్రయత్నం చేశారని వాపోయారు. ఎక్కడెక్కడి నుంచో వైద్యం కోసం వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఎస్సారెస్పీ భూముల్లో కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. ఆగ్రోస్ స్థలంలో కాంగ్రెస్ నాయకులు మల్టీప్లెక్స్ కట్టేందుకు యత్నించారని, కానీ ప్రజా అవసరాల కోసం తాను ఈ భూముల్లో మెడికల్ కళాశాలను నిర్మించానని చెప్పారు. జిల్లా కేంద్రం అయినందున విద్యార్థులకు వసతి సౌకర్యం, కమ్యూనిటీ భవనాల కోసం స్థలాల సేకరణకు యత్నిస్తుంటే కొందరు నాయకులు ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిటీ భవనాలకు, విద్యార్థుల వసతికి భూములు వద్దని సదరు నాయకుడు చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో 40 గ్రామాల్లో రూ1.40 కోట్లతో కమ్యూనిటీ భవనాలు మంజూరు చేశానన్నారు.

### బీఆర్ఎస్‌తో కాపులకే ఎక్కువ లబ్ధి

-జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు, 24 గంటల నిరంతర విద్యుత్ వంటి పథకాలతో మున్నూరు కాపులే ఎక్కువగా లబ్ధి పొందుతున్నారని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సంతోషం వ్యక్తం చేశారు. సమైక్య పాలనలో సాగు నీరు లేక, కరెంట్ రాక పంట భూములన్నీ పడావులుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాపుల ఇండ్లకు పిల్లనిచ్చేందుకు వెనుకాడేవారని వాపోయారు. కానీ 2014 తర్వాత సీన్ మొత్తం మారిందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో భారీ నీటి ప్రాజెక్టులు నిర్మించి, చెరువులు తవ్వించడంతో చెరువులు, బావుల్లో పుష్కలంగా నీరు చేరిందని తెలిపారు. వ్యవసాయానికి నిరంతరంగా 24గంటల విద్యుత్ సరఫరా చేస్తుండడం, పంట సాయం కింద ఎకరాకు రూ. 10 వేలు ఇస్తుండడంతో నేడు ప్రతీ ఎకరా పచ్చని పంట పొలాలతో కళకళలాడుతుందన్నారు.

### బీఆర్ఎస్‌కే ఓటేస్తామని తీర్మానం

జిల్లా కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించిన మున్నూరు కాపులు అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆత్మీయ సమ్మేళనంలో మున్నూరు కాపు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు, సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# అక్కున చేర్చుకోండి.. మీ రుణం తీర్చుకుంటా

- కాంగ్రెస్, బీజేపీ మాయమాటలతో మోసపోయి గోసపడొద్దు
- చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్

రామడుగు, అక్టోబర్ 30: తనను ఆశీర్వదించి అక్కున చేర్చుకుంటే, అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటానని చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీ ప్రాంతం బిడ్డగా ఐదేండ్లల్లో నియోజకవర్గాన్ని ఎన్నడూ లేనంత అభివృద్ధి చేశానని, కారుగుర్తుకు ఓటేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని కోరారు. రామడుగు మండలం దత్తోజిపేట, రంగశాయిపల్లి, రుద్రారంతోపాటు అనుబంధ గ్రామం కొత్తపల్లె(గౌండ్లపల్లి)లో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. తొమ్మిదేండ్ల కింద తెలంగాణ ఎట్లుండేనో మీ అందరికీ తెలుసన్నారు. తాగేందుకు గుక్కెడు నీళ్లు లేక ఆడబిడ్డలు బిందెలతో రోడ్డెక్కి చేసిన ఆందోళనలు ఇంకా గుర్తున్నాయన్నారు. సాగు చేసేందుకు భూములున్నా.. నీళ్లు లేక పంట ఎడిపోతే రైతన్న గుండెపగిలి ప్రాణాలు తీసుకున్న వార్తలు ఇంకా మరిచిపోలేదన్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిలా.. ప్రతి ఏడూ వేల క్యూసెక్కుల నీళ్లు మన ప్రాంతం నుంచి వెళ్లి సముద్రంలో కలుస్తున్నా.. నాటి పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. నాడు చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాలు కరువుతో అల్లాడేవన్నారు. అలాంటిది రాష్ట్రం ఏర్పాటు తర్వాత కాళేశ్వరం జలాలతో భూములను తడిపి వ్యవసాయ రంగానికే వన్నె తెచ్చిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. నేడు నిత్యం నీటితో కళకళలాడుతూ ఎటుచూసినా పచ్చని పంటపొలాలే దర్శనమిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గాన్ని కోనసీమలా తీర్చిదిద్దేందుకు వరదకాలువకు నాలుగు ఓటీల నిర్మాణం చేపట్టామని, దీంతో ప్రతి ఎకరాకు నీటిని మలుపుకొని సాగుచేసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ కృషితోనే నేడు అభివృద్ధిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. దేశాన్ని 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ కర్ణాటకలో ఐదు గ్యారెంటీలతో గద్దెనెక్కి, అభివృద్ధి చేయలేక చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. అక్కడ 5 గంటలు కూడా ఇవ్వలేమని స్వయంగా ఆ రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రే చెప్పడం విడ్డూరమన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలతో మోసపోయి గోసపడొద్దని విజ్ఞప్తి చేశారు. మరోసారి కేసీఆర్‌ను సీఎంగా గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



రుద్రారంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలతో కలిసి ర్యాలీగా వెళ్తున్న చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్